



సముద్రపు కోతకు త్వరలో శాశ్వత పరిష్కారం

» రూ.323 కోట్లతో ప్రతిపాదనలు » డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



పిఠాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న సముద్ర కోత సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనున్నదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో ఈ కోత నివారణకు కోస్టల్ ప్రొటెక్షన్ స్ట్రక్చర్స్ నిర్మాణానికి రూ.323 కోట్లతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపినట్టు ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గత ఐదేళ్లలోనే సగటున ఏడాదికి 1.23 మీటర్ల వంతున ఇప్పటిదాకా 12 మీటర్ల మేర తీర ప్రాంతం కోతకు గురైందని తెలిపారు. దీంతో తీర ప్రాంత గ్రామాలు, నివాసముంటున్న మత్స్యకారులకు, వారి గృహాలకు భారీ నష్టం జరుగుతోందని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎన్నికల సమయంలో కూటమి తరఫున హామీ ఇచ్చిన విషయాన్ని అప్పటి ఎన్నికల ప్రచార వీడియోను పోస్ట్ చేసి గుర్తుచేశారు. తీర ప్రాంత ప్రజల ఆశలను ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా గుర్తించి ప్రతిపాదనలు ఆమోదిస్తారని పవన్ తెలిపారు. ఆమోదం లభించగానే తక్షణం పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

ప్రమాదకర పరిశ్రమల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్‌డ్రిల్ నిర్వహించడంతోపాటు పరిశ్రమలకు దగ్గరలో ఉంటున్న ప్రజలకు పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా సంక్షోభ నివారణ కమిటీ సమావేశం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో హాజర్యారు. పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, ఏపీఐఐసీ, కార్మిక, వ్యవసాయం, వైద్య-ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుతీరు, ప్రమాదకర రసాయనాల తయారీ, నిల్వల వివరాలు, ప్రమాద సంఘటనలు చోటుచేసుకునే సందర్భాల్లో పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోని పరిశ్రమల్లో చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని పరిశ్రమల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రధానంగా 15 ప్రమాదకర పరిశ్రమలను గుర్తించామన్నారు. ఆ పరిశ్రమలకు ఆనుకుని ఉన్న నివాసాల్లో ప్రజలకు పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలను ముందే పసిగట్టి సిబ్బందిని అప్రమత్తం చేసేలా పరిశ్రమల్లో అలారం, సెన్సార్, ఇతర భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రాజేష్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, పరిశ్రమల శాఖ జీఎం గణపతి, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, ఇండియన్ ఆయిల్, రిలయన్స్, ఓఎన్జీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శాకంబరి అవతారంలో అమ్మవార్లు

వైభవంగా ఆషాఢ మాస పూజలు

శాకంబరి అవతారంలో భానుగుడిలోని రాజరాజేశ్వరి అమ్మవారు →

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ఆషాఢ మాస పూజలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ, చండీహోమం నిర్వహించారు. భానుగుడి కూడలిలోని భానులింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. అన్నమ్మ ఘాటీ సెంటర్ సమీపంలోని ఇందిరా కాలనీలోని కనకదుర్గ సత్తెమ్మ తల్లి, దేవాలయం వీధిలోని ఆలయాల పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అర్చకులు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భానుగుడి సెంటర్లోని భానులింగేశ్వరస్వామి ఆలయ ఈవో వి.శ్రీనివాసరావు, సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రిపరేషన్!

రైస్ కార్డులకు.. రైట్ రైట్



(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. గత వైసీపీ హయాంలో కొత్త కార్డుల జారీ లేక పోవడంతో వేలాది మంది పేదలు ఈసురోమన్నారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా అప్పట్లో ఏరేశారు. దీంతో ప్రభుత్వం మారాక కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 1.53 లక్షల మంది అర్జీలు అందించారు. ఇందులో ఏకంగా 1.10 లక్షల మంది తమకు ఉన్న కార్డుల్లో అదనపు సభ్యులను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దాదాపుగా పచ్చజెండా ఊపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తకార్డులను మంజూరు చేయనుంది.

నాడు ఉన్ననీ పీకేశారు..

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా ఏరేశారు. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటిని రద్దుచేసేశారు. దీంతో ప్రతిపక్ష హోదాలో నాడు టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది.అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. దీంతో గత మే 14 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైనవారు, ఇప్పటివరకు రేషన్ కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది.

1,53,341 అర్జీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 1,53,341 మంది నుంచి అర్జీలు వచ్చాయి. కొత్తకార్డులు కావాలంటూ 14,197 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉన్న కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలంటూ 1,10,587 మంది విజ్ఞప్తులు చేశారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీల్లో 90 శాతానికిపైగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు అన్ని అర్జీలను అధికారులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి జాబితా కూడా పంపారు. త్వరలో కొత్త కార్డుల జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. దీంతో త్వరలోనే కార్డులు అందుతాయి.

» రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
» ఉమ్మడిగా 1,53,341 వినతులు
» వైసీపీలో కార్డుల్లో కోత
» కూటమి ప్రభుత్వంలో అవకాశం
» భారీగా వెల్లువెత్తిన విజ్ఞప్తులు
» చేర్పులకు 1,10,587 దరఖాస్తులు
» అధికారుల గ్రీన్‌సిగ్నల్
» ఏటీఎం కార్డులా రైస్ కార్డులు

ఏ జిల్లాకు ఎన్ని..

- కాకినాడ జిల్లా నుంచి 62,988 మంది ఉన్నారు. ఉన్న కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలని 46,729 మంది, రేషన్‌కార్డు విభజించాలని 6,091, కొత్త కార్డులకు 5,170, చిరునామా మార్పునకు 1,986 మంది అర్జీలు అందించారు.
- కోనసీమలో మొత్తం 45,080 దరఖాస్తులు రాగా చిరునామా మార్పునకు 1,751, కొత్త సభ్యులను చేర్చాలంటూ 32,254 పేర్లు రద్దుకు 1,275 కొత్తకార్డులకు 4,268, కార్డు విభజించాలని 4,536 అర్జీలు వచ్చాయి.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి 45,273 అర్జీలు వచ్చాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 31,604 మంది మొర పెట్టుకున్నారు. కార్డులు విభజించాలంటూ 4,664 మంది, కొత్త కార్డులు కావాలని 4,759 మంది అర్జీలు అందించారు.

ఇక డిజిటల్ కార్డులు

చంద్రబాబు అంటేనే ఐటీ ముఖ్యమంత్రి అంటారు.. ప్రస్తుతం రేషన్ కార్డుల్లోనూ ఆ మార్పు చూపిస్తున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలు కూడా తెలపవచ్చు.




పోర్టు భద్రతకు పటిష్ట చర్యలు : ఎస్పీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):కాకినాడ పోర్టు భద్రతకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ జి. బిందుమాధవ్ పేర్కొన్నారు. పోర్టు భద్రతా చర్యల పర్యవేక్షణ నిమిత్తం శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో పోర్టు, కోస్టుగార్డ్, మెరైన్, కస్టమ్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, కేఎస్‌పీఎల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పోర్టు భద్రత తమ ప్రాథమిక విధి అని, పోర్టు పరిసర ప్రాంతాలు సీసీ కెమెరాల నిఘా పటిష్టంగా ఉండేలా, అవి నిరంతరం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంత గస్తీలో డ్రోన్ల నిఘాను డేగ కన్నుతో పటిష్టం చేశామన్నారు. ముఖ్యంగా పోర్టు పరిధిలో చమురు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర తీర ప్రాంతంలో అనుమానాస్పద పడవలను గుర్తించి వాటిని పూర్తిగా పరిశీలించాలన్నారు. నేరస్థులు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోస్టుగార్డ్, మెరైన్, కస్టమ్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాలు కలిసి ప్రతిరోజూ గస్తీ నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పోర్టు లోపల జరిగే ఎగుమతి, దిగుమతుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కాకినాడ పోర్టును భద్రత కలిగిన ప్రాంతంగా మార్చాలని ఎస్పీ కోరారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త్ర, కేఎస్‌పీఎల్ ప్రతినిధి ఎస్ఎల్ శ్రీనివాస్, కోస్టుగార్డ్ అధికారి దివాకరం, మెరైన్ సీఐ కె.రాంమోహన్‌రెడ్డి, పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, కస్టమ్స్ అధికారులు సచిన్‌కుమార్, మీనా, ఎస్‌పీఎఫ్ సీఐ వై.శ్రీధర్, ఆర్ఐ ఎంఎన్ మూర్తి పాల్గొన్నారు.

చారిత్రక నవలా రచయిత సాధు సుబ్రహ్మణ్యం శర్మ కన్నుమూత



కాకినాడలో లైబ్రరీని నిర్వహిస్తున్న సాధు (ఫైల్)

కాకినాడ కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) ప్రముఖ నవలా రచయిత సాధు సుబ్రహ్మణ్యం శర్మ (94) కాకినాడలోని తన స్వగృహంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. కోరంగిలో 1830లో వచ్చిన పెను ఉప్పెన ఇతివృత్తాన్ని చేసుకుని ఆయన రాసిన చారిత్రక నవల 'బంకోలా' చరిత్ర సృష్టించింది. ఇంకా అనేక రచనలు చేశారు. పరిశ్రమలశాఖలో జనరల్ మేనేజర్ హోదాలో 1990లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన కాకినాడ స్పెన్సర్స్ సమీపంలో ఒక అద్దె ఇల్లు తీసుకుని 2 వేల పుస్తకాలతో ప్రైవేటు లైబ్రరీని నడిపారు. 10

ఆనంద హరితం!



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవేర్చింది.. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా పెంచిన హరిత పన్ను వాహనదారుల తలకు మించిన భారమైంది. రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వందల్లో ఉండే గ్రీన్‌ట్యాక్స్‌ను వేలల్లో పెంచింది.. పర్యావరణం పేరుతో పది టన్నుల లారీలపై రూ.ఐదు వేలు, 30 టన్నుల లారీలపై రూ.15 వేలు విధించడంతో లారీ యజమానులు గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ ట్యాక్స్ తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హరిత పన్ను విషయమై లారీ యజమానుల వినతిని సర్కారు పరిశీలించింది. (గ్రీన్ ట్యాక్స్) హరితపన్ను భారాన్నితగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వైసీపీలో పిండుడే..


గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్టంగా రూ.20 వేల వరకు గ్రీన్ ట్యాక్స్ విధించగా కూటమి ప్రభుత్వం దీనిని సవరించి ఏడాదికి రూ.1500, రూ.3000 చొప్పున రెండు శ్లాబుల్లో వసూలు చేసేలా కొత్త విధానం తెచ్చింది. సరకు రవాణా (లారీలు, వ్యాన్లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను కేవలం రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించాలని దీనిని పెంచుకునేలా కేంద్రం వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. ఏడు నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను విలువ, పదేళ్ల నుంచి 12 ఏళ్ల నాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసింది. పాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.ఆరు వేలు, చివరికి ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచారు. పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా, వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లాలో 2.94 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరిత పన్ను పిండేసింది.

» నెరవేరిన మరో హామీ
» గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు
» వైసీపీలో రూ.20 వేలు
» ప్రస్తుతం రెండు స్లాబ్‌లు
» రూ.1500, రూ.3 వేలు
» సర్కారు ఉత్తర్వులు జారీ

జిల్లాల్లో తగ్గనున్న భారం

ప్రస్తుతం హరిత పన్నుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడి జిల్లా వాహనాలపై పన్నుభారం తగ్గనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరిజిల్లాలో 2.10 లక్షల వాహనాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.ఏడు కోట్ల పన్ను భారం తగ్గనుంది.

చెల్లింపులకు.. నీళ్లు!



ద్వారంపూడి కంపెనీ నుంచి గోదావరి నీటి విక్రయం ఇలా...

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గోదావరి నీటితో కొన్ని కంపెనీలు కాకినాడలో అడ్డంగా వ్యాపారం చేసేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి కారుచౌకగా నీటిని కొట్టేస్తూ కోట్లకు కోట్లు వెనకేసుకుంటున్నాయి. గోదావరి నీటిని పైపులైన్ల ద్వారా తీసుకుని వాటిని అనేక పరిశ్రమలు, పోర్టు, నౌకలకు అమ్ముకుంటూ అడ్డంగా గడిస్తున్నా.. ప్రభుత్వానికి కట్టాల్సిన నామమాత్రపు ఛార్జీలు కట్టడానికి ససే మిరా అంటున్నాయి. రెండేళ్ల తరబడి ఇదే తంతు.అడగాల్సిన అధికారులేమో మనకెందుకులే అని వదిలేయడంతో వీరి ఆటలకు అంతులేకుండా పోతోంది. వెరసి ప్రభుత్వానికి రూ.45.50 కోట్ల మేర ఆదాయానికి గండి పడింది. నీటి సరఫరాలో కోత వేస్తే దారికి వచ్చే అవకాశం ఉన్నా అధికారులు సాహసించకపోవడంతో సదరు కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

అంతా మా ఇష్టం...

కాకినాడ చుట్టుపక్కల అనేక భారీ పరిశ్రమలు ఉన్నాయి.ఆ పక్కనే కాకినాడ సీపోర్టు కూడా ఉంది. పరిశ్రమలు,పోర్టుకు నిరంతరం నీళ్లు అవసరం. ఈ నీటిని పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సామర్లకోటలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా అందిస్తోంది. ప్రభుత్వం నేరుగా ఆయా సంస్థలకు నీటిని సరఫరా చేయ కుండా ప్రైవేటు కంపెనీలకు తక్కువ ధరకు విక్రయిస్తోంది. ఈ నీటిని నామమాత్రపు ధరకు కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయించి సొమ్ము చేసుకుంటాయి. ఒకరకంగా చెప్పాలంటే లీటర్ రూ.10 చొప్పున ప్రభుత్వం విక్రయిస్తే ఆ నీటిని పైపైన శుద్ధి చేసి ఆ కంపెనీలు రూ.30కి పైగా పరిశ్రమలకు అమ్ముకుంటున్నాయి. ఇలా అమ్మే నీళ్లకు ఒక్కో కంపెనీ నెలకు రూ.40 లక్షల వరకు లాభాలు పొందుతున్నాయి. కానీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలు కట్టడానికి చేతులు రావడం లేదు. అటు అధికారులు పట్టించుకోవడం లేదు. నీటిని కొనుగోలు చేసి విక్రయిస్తోన్న కంపెనీలు దాదాపుగా అన్నీ రాజకీయనేతలు, పలుకుబడి ఉన్న సంస్థలు కావడంతో వాటి జోలికి పదకొండేళ్లుగా వెళ్లడం లేదంటే ఎంత దారుణమో అర్థం చేసుకోవచ్చు. కంపెనీలు సైతం బాధ్యతగా ప్రభుత్వానికి నీటి ఛార్జీలు చెల్లించడానికి ఇష్టపడడం లేదు.

నోటీసులిచ్చినా..

రూ.45.50 కోట్లకుపైగా బాకీలు పెరిగిపోయినా అధికారులు మాత్రం ఈ కంపెనీలకు నీటి సరఫరా నిలిపివేయకుండా ఎంచక్కా సరఫరా చేస్తూనే ఉన్నారు. దీంతో ఆయా సంస్థలు సైతం దర్జాగా అడ్డగోలుగా వ్యాపారం చేసుకుంటూ కోట్లలో సంపాదించుకుంటున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ దృష్టికి ఈ వ్యవహారం వెళ్లడంతో అధికారులపై సీరియస్ అయ్యారు. 14రోజుల్లోగా బాకీలు చెల్లించాలంటూ కంపెనీలకు నోటీసులు పంపించారు. కానీ ఒక్క ఎస్ఎఫ్‌సీఎల్ మినహా మిగిలినవేవీ కనీసం స్పందించలేదు. ఇదిలా ఉండగా "ద్వారంపూడి దర్జా" అంటూ ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. బకాయిలు ఎగ్గొట్టిన అన్ని కంపెనీలకు శుక్రవారం రెండో విడత నోటీసులు జారీచేశారు. 14 రోజుల్లోగా స్పందించకపోతే నీటి సరఫరా నిలిపివేయాలని నిర్ణయించారు.

» నీళ్లతో దర్జాగా వ్యాపారం
» కారుచౌకగా నీళ్లు
» పరిశ్రమలు,పోర్టులకు విక్రయం
» కోట్లలో సంపాదన
» ఛార్జీలు కట్టకుండా ఎగనామం
» రూ.45.50 కోట్ల బాకీలు
» కలెక్టర్ ఆగ్రహంతో నోటీసులు

ఐదు కంపెనీలు..

ప్రధానంగా ఐదు కంపెనీలు పదకొండేళ్లుగా కట్టాల్సిన బాకీలు ఏకంగా రూ.44 కోట్ల వరకు పేరుకుపోయాయి. కాకినాడ సీపోర్టు (కేఎస్‌పీఎల్) రూ.13.17 కోట్లు బాకీలు చెల్లించలేదు. ఈ సంస్థ 0.75 ఎంజీడీ గోదావరి నీటిని తీసుకుని సొంత అవసరాలకు,నౌకలకు విక్రయిస్తోంది. 2016 ఏప్రిల్ 25 నుంచి మే 31 వరకు కలిపి ప్రభుత్వానికి రూ.13.17 కోట్ల బాకీలు కట్టలేదు. అధికారంలో ఉన్న ఓ రాజకీయ నేతకు చెందిన అన్నపూర్ణ మెరైన్స్ కంపెనీ 0.25 ఎంజీడీ నీటిని తోడుకుంటూ పరిశ్రమలకు అమ్ముకుంటోంది.ఈ కంపెనీ 2018 ఫిబ్రవరి 2 నుంచి ఈ ఏడాది మే 31 వరకు కలిపి ప్రభుత్వానికి రూ.9.12 కోట్లు బాకీ పడింది. మాజీ ఎమ్మెల్యే ముత్తా గోపాలకృష్ణకు చెందిన ముత్తా శశిధర్ అండ్ కో కంపెనీ 0.1 ఎంజీడీ నీటిని తీసుకుంటూ 2019 డిసెంబర్ నుంచి రూ.2.73 కోట్ల బాకీలు చెల్లించడం లేదు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి చెందిన అంజనీ ఏజెన్సీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏకంగా 2014 ఏప్రిల్ 18 నుంచి ఈ ఏడాది మే 31 వరకు రూ.13.84 కోట్లు బాకీ పడింది. ఈయనకు భయపడి అధికారులు అసలు కంపెనీ జోలికే వెళ్లలేదు.అశోకా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ 0.20 ఎంజీడీ నీటిని తీసుకుంటూ 2020 జనవరి నుంచి ఈ ఏడాది మే 31 వరకు రూ.5.39 కోట్లు నీటి ఛార్జీలు చెల్లించకుండా ఎగ్గొట్టేసింది.నాగార్జున ఎరువుల కర్మాగారం 9ఎంజీడీల నీటిని తీసుకుంటూ గతేడాది జూన్ 1 నుంచి ఈఏడాది మే 31 వరకు రూ.1.47 కోట్ల బాకీలు చెల్లించడం లేదు.

నేడు జిల్లాలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కింద జిల్లావ్యాప్తంగా శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. అంతం-ప్లాస్టిక్ కాలుష్యం అనవసరమైన ప్లాస్టిక్‌ను, సంబంధిత కాలుష్యాన్ని నివారించాలనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలందరికీ తెలిసేలా టాంటాం వేయించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఐఈసీ యాక్టివిటీలు చేపట్టాలన్నారు. స్వచ్ఛ దివస్‌ను ప్రణాళిక ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.

నెయ్యి డబ్బాలు దొంగిలిస్తుంటే పట్టివేత...

అన్నవరంలో ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెన్షన్ 7

శాకంబరీ నమోస్తుతే



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామ దేవత వనువులమ్మ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ గ్రామ దేవత ముత్యాలమ్మ

ఆషాఢ శుక్రవారం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు. వందల కిలోల కూరగాయలు, ఆకు కూరలతో దేవతామూర్తులను అలంకరించగా భక్తులు దర్శించుకుని పులకించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా పూజిస్తే కలిగే ప్రయోజనాలను పండితులు వివరించారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారు

ఆయిల్‌పామ్‌పై రైతుల మొగ్గు

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగు చేయాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం సాగించడంతో పాటు పలు రాయితీలు అందిస్తోంది. దీంతో నీటి లభ్యత తక్కువ, ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వరికి బదులుగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

- వరి సాగుకు ప్రత్యామ్నాయం
- ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు
- విస్తృత ప్రచారం చేస్తున్న ప్రభుత్వం



గొల్లప్రోలు మండలంలో సాగవుతున్న ఆయిల్‌పామ్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మెట్ట, మైదాన ప్రాంతాల్లోనూ ఆయిల్‌పామ్ విస్తీర్ణం గణనీయంగా పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టింది. ఉద్యానవన శాఖ ద్వారా ప్రచారం సాగిస్తోంది. ఉద్యానవన శాఖ ద్వారా సాగుకు, ఇందుకు అవసరమైన యంత్ర పరికరాలపై అందించే సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు దిగుబడులు వచ్చిన తర్వాత కచ్చితమైన మార్కెట్ సౌకర్యం ఉంటుందనే భరోసా కల్పిస్తోంది. వరి అధికంగా పండించే కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాల్లో వరి సాగు తగ్గించి ఆయిల్‌పామ్ వైపు దృష్టిసారించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మండలాల వారీగా టార్గెట్లు విధించినప్పటికీ ఇప్పుడు సాధ్యమైనంత వరకు ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ చేసేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు.

గతంలో నీటి లభ్యత లేని ప్రాంతాల్లోనే ఎక్కువగా ఆయిల్‌పామ్‌ను సాగు చేసేవారు. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట మండలాల్లోనే దీని విస్తీర్ణం అధికం. గోదావరి, ఏలేరు, పీబీసీ, పంపా, తాండవ, పుష్కర ఆయకట్టు ప్రాంతాల్లోనూ ఇప్పుడు సాగు ప్రారంభమైంది. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఇటీవల ఒక ఎన్ఆర్ఐ వైద్యుడు తనకు గల పది ఎకరాల్లో వరి సాగు మాని ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఇదే రీతిలో పలు ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రైతుల్లో మొదలైంది. అయితే దిగుబడి రావడానికి ఎక్కువ సమయం వేచిచూడటం, అప్పటివరకు పంటపై ఎటువంటి ఆదాయం ఉండకపోవడం ఒక మైనస్‌గా మారింది. అయితే ఆయిల్‌పామ్ మొక్కల మధ్యలో కాయగూరలు, అపరాలు, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెప్తున్నారు. ఏడవ ఏడాది నుంచి హెక్టార్‌కు సగటున రూ.2.50 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందంటున్నారు. 25 సంవత్సరాలు పాటు దీర్ఘకాలంగా కొనసాగే పంట కావడంతో ఒకసారి మొక్కలు నాటితే ప్రతి ఏటా వరి మాదిరిగా పంట వేసే అవసరం ఉండదని వివరించారు..

నూతన సాగుపై రాయితీలు: వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు (2.50 ఎకరాలు) ఎన్ఎంఈవో-ఓపీ పథకం కింద రూ.29వేలు సబ్సిడీ లభిస్తోంది. 9 ఇంటు 9 మీటర్ల దూరంలో హెక్టారుకు కనీసం 143 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఈ దిగుమతి నాటును పెద్దాపురం పతంజలి సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు. ఇదే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తోంది. అంతర పంటలుగా కాయగూరలు, అపరాలు సాగుకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. పామాయిల్ దిగుబడి వచ్చేదాకా అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుంది.

ఆయిల్‌పామ్ పంటకు డ్రిప్ ఇరిగేషన్ తప్పనిసరి. ఈ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై, ఐదు ఎకరాల లోపు రైతులకు 90శాతం, 5-10 ఎకరాల రైతులకు 70శాతం, పది ఎకరాలు పైబడిన రైతులకు 50శాతం సబ్సిడీపై సరఫరా చేస్తారు. ఈ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తుంది. అదే విధంగా సాగులో అవసరమైన చాప్ కట్టర్ యూనిట్‌కు రూ.50వేలు, ట్రాక్టర్‌తో ట్రాలీ యూనిట్‌కు రూ.2లక్షలు, అల్యూమినియం పోర్టబుల్ ల్యాడర్‌కు రూ.5వేలు, మోటారైజ్డ్ చిసెల్‌కు రూ.15 వేల వరకు ప్రస్తుతం రాయితీ ఇస్తున్నారు.

ఏలేరు, పీబీసీ ఆయకట్టులోనూ ...

ఏలేరు, పీబీసీ, పుష్కర ఆయకట్టులోనూ ఆయిల్‌పామ్ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో కొత్తగా 58 హెక్టార్లలో ఆయిల్‌పామ్ పంట వేశారు. ఇప్పటికే పంట ఉన్న విస్తీర్ణం 1246 హెక్టార్లు కాగా... ఈ ఏడాది 350 హెక్టార్లల్లో అదనంగా సాగు చేస్తారని భావిస్తున్నారు.



ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు

స్థిర ఆదాయానికి ఆయిల్‌పామ్ సాగు చేయండి



వై.సోమరాజశేఖర్,
ఉద్యానవన శాఖాధికారి, పిఠాపురం

స్థిరమైన అధిక ఆదాయం కోసం ఆయిల్‌పామ్ సాగు చేస్తే మేలు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా దీనిని సాగు చేస్తే తక్కువ నీటితోనే పంట పండించవచ్చు. దిగుబడులు వచ్చే వరకు అంతర పంటలుగా కాయగూరలు, కందులు, అపరాలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చు. ఆయిల్‌పామ్ సాగుకు, ఇందుకు అవసరమైన పరికరాలకు ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోంది. రైతులు వీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాము. ఆయిల్‌పామ్ సాగుపై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

ద్రాక్షారామలో నేడు సీతారాముల కల్యాణం

- కల్యాణ రథం ఊరేగింపు
- 21తో ముగియనున్న సప్తసప్తాహం



పురవీధుల్లో ఊరేగుతున్న సీతారాముల కల్యాణరథం

ద్రాక్షారామ,జూలై18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం భద్రాది సీతారాములు కల్యాణం జరుగుతుంది. ప్రసన్నాంజనేయస్వామి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో గత నెల 2న ప్రారంభమైన సప్తసప్తాహం ఈనెల 21న ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి సోమవారం వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం భద్రాది సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భద్రాది సీతారాముల కల్యాణ రథం శుక్రవారం సాయంత్రం ద్రాక్షారామ చేరుకుంది. భద్రాది నుంచి సీతారాముల కల్యాణం జరిపించేందుకు వైదిక బృందం, ఆలయ సిబ్బంది వచ్చారు. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు.

కల్యాణరథం ఊరేగింపు

శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణరథాన్ని ద్రాక్షారామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా సప్తసప్తాహం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులతో జరుగుతుంది. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని బాలభక్తసమాజం అధ్యక్షుడు బోనం శ్రీను తెలిపారు.

మరుగుదొడ్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 15 న్యాయస్థానాల్లో 223 మరుగుదొడ్లను కాంట్రాక్టు పద్ధతిలో నిర్వహించడానికి ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. 34 మంది సిబ్బందిని నియమించుకొని ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకూ రాజమహేంద్రవరంలోని 59, అమలాపురం 15, కాకినాడ 46, పెద్దాపురం 13, పిఠాపురం 30, రామచంద్రాపురం 6, రాజోలు 8, కొత్తపేట 6, ఆలమూరు 9, ప్రత్తిపాడు 10, ముమ్మిడివరం 5, తుని 6, అనపర్తి 5, రంపచోడవరం 3, అడ్డతీగలలోని 2 మరుగుదొడ్లను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఏజెన్సీలు జూలై 25 సాయంత్రం 5గంటలలోపు తమ కొటేషన్లను సీల్డ్ కవరులో రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు కార్యాలయంలో సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఆయా మరుగుదొడ్ల ప్రదేశాలను పని దినాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య స్వయంగా వచ్చి పరిశీలించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

అశోక్ గజపతిరాజును కలిసిన కోటిపల్లి దేవస్థానం సిబ్బంది



గజపతిరాజుకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

కె.గంగవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతి రాజు ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిపల్లి శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను దేవస్థానం ఈవో భీమశంకరం ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకస్వాములు కలిసి శుక్రవారం విజయనగరం వెళ్లి అభినందనలు తెలియజేశారు. స్వామి వారి ప్రసాదం అందజేశారు.

వరద తగ్గుముఖం

ధవళేశ్వరం, జూలై 18(ఆంధ్రజ్యోతి):తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ ద్వారా 46,406 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం 13.30 అడుగులుగా నమోదయింది.

ఆధునికతకు పెద్దపీట

- నూతన విద్యావిధానంతో ప్రపంచీకరణపై అవగాహన
- జేఎన్‌టీయూ మొట్ట మొదటి మహిళా వీసీ శాంతిశ్రీ పండిట్
- వర్శిటీలో ముగిసిన వర్క్‌షాప్



ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు, వర్శిటీ అధికారులు

జేఎన్టీయూకే, జూలై 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఏరోస్పేస్ సర్వీస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఒకేషనల్, పబ్లిక్ డిజైన్ కోర్సులను అందించి ఆధునికతకు పెద్దపీట వేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జేఎన్‌యూ) మొట్ట మొదటి మహిళా ఉపకులపతి ప్రొఫెసర్ ధూళిపూడి శాంతిశ్రీ పండిట్ అన్నారు. యూసీఈకే ఓక్ ఉత్సవాలు సందర్భంగా వర్శిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించిన రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047 వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకురాలిగా విచ్చేసిన శాంతిశ్రీ మాట్లాడుతూ నూతన విద్యావిధానం 36 ఏళ్ల తరువాత రూపొందించబడిందని దీని వల్ల ప్రపంచీకరణపై అవగాహన కలుగుతుందని, అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పరిశ్రమలకు నైపుణ్యాలతో కూడిన వ్యక్తుల అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే యుద్ధాలను భారతీయ ఇంజనీర్లు తమ శక్తి మేరకు అన్వేషణలను సాగించి వాటిని ఎదుర్కొనేలా సన్నాహమవ్వాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఇష్లా వీసీ ఎన్.నాగ రాజు మాట్లాడుతూ భారతదేశంలో మిలియన్‌కు 260 మంది మాత్రమే శాస్త్రీయ నిపుణులుండగా చైనాలో మిలియన్‌కు 1000 మంది ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలని అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహించి పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టేలా ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఏ మాజీ వీసీ జె.బాలగంగాధర్‌తిలక్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047గా అభివృద్ధి చెందాలంటే ఉన్నతవిద్యలో పలుమార్పులు తీసుకురావాలన్నారు. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రాంలను ప్రారంభించాలని, నాన్ ఇంజనీరింగ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టి సోషల్‌సైన్స్ టెక్నికల్ కోర్సులను కలిపి నేర్పించాలని సూచించారు. పూర్వవిద్యార్థి ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ సోలార్, న్యూక్లియర్, థర్మల్ విద్యుత్ ద్వారా గ్రీన్ ఎనర్జీని పెంపొందించాలన్నారు. ఏపీలో వనరుల కొరత లేదని పరిశ్రమలను స్థాపించుటకు భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ అకడమీషియన్స్ టు రియలైజ్ ద ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి జేఎన్టీయూకే పూర్వవిద్యార్థి ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ అధ్యక్షత వహించగా ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, కృష్ణా యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.రాంజీ, పూర్వ విద్యార్థులు కొండలరావు, నాగిరెడ్డి, ఇడెల్కో సీఈవో శ్రీనివాసప్రసాద్, బీటీహెచ్ స్వీడన్ డైరెక్టర్ గురుదత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను అతిథులు, అధికారులతో కలిసి ఆవిష్కరించి ప్యానల్ నిపుణులను సత్కరించారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ చైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతిశ్రీ పండిట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

21న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాసలో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో స్టోర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, రైటర్, పర్సనల్ సెక్రటరీ, రిసెప్షనిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, టెక్నీషియన్, టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, సీఏ, ఇంటర్, బీటెక్, ఎంకాం ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

అనఘా దత్తక్షేత్రంలో శత చండీయాగం

పిఠాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం అగ్రహారం దత్తనగర్‌లోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో శత చండీ యాగం శుక్రవారం ప్రారంభమైంది. అంకురార్పణ, ఇతర పూజల్లో మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద తీర్థ స్వామి పాల్గొన్నారు. వేద పండితులు క్రతువులు జరిపారు. విజయానంద స్వామి చేపట్టిన చాతుర్మాస్య వ్రత దీక్ష 9వ రోజు కొనసాగింది. జైమినీ భారతంపై ప్రవచించారు.

హాస్టల్ బాలికల ఆకలి కేకలు

- చర్మ వ్యాధులతో బాధపడుతున్న పలువురు విద్యార్థులు
- కలెక్టర్‌కు పెద్దాపురం బీసీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో శ్రీరమణి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సుధా కాలనీలోని బీసీ బాలికల వసతిగృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఆకలితో అలమటిస్తున్నారు. వార్డెన్ నిత్యం విద్యార్థినుల వేధించడంతో వారి బాధలు వర్ణనాతీతం. 80 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో నిత్యం వారు నరకం చూస్తున్నారు. దీంతో విద్యార్థినులు తాము అనుభవిస్తున్న బాధలను కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం హాస్టల్‌ను తనిఖీ చేయాలని ఆర్డీవో శ్రీరమణి, ఎంపీడీవో డి.శ్రీలలితను ఆయన ఆదేశించారు. దీంతో వారు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల బాధలు విని తల్లడిల్లిపోయారు. పైగా విద్యార్థినులు చాలా మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించారు. తమ బాధలు చెప్పుకుందామమంటే వార్డెన్ తమని బూతులు తిట్టడంతో పాటు కొడుతోందని విద్యార్థినులు వాపోయారు. 80 మంది విద్యార్థినులకు కేవలం మూడు మాత్రమే టాయిలెట్లు ఉండడం పైగా అవి పరిశుభ్రంగా లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నట్టు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెను ప్రకారం భోజన పెట్టడంలేదని, తమని దుర్భాషలాడుతున్నట్టు విద్యార్థినులు అధికారులకు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

వార్డెన్ విశాలాక్షి సస్పెన్షన్

బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం రాత్రి హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే కలెక్టర్ షాన్ మోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి హాస్టల్లో జరుగుతున్న విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, చర్మ వ్యాధులకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ స్పందించి వార్డెన్ విశాలాక్షిని సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే మిగిలిన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించాలని ఆదేశించినట్టు తెలిపారు. అధికారులు పట్టణ, మండలంలోని దివిలి గ్రామంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను పరిశీలించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఒక్క రోజులోనే చిక్కాడు!

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాజోలులో పట్టుకున్న పోలీసులు

రాజోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం వ్యక్తి చేతిలో మహిళ దారుణ హత్యకు గురైన సంగతి పాఠకులకు విధితమే. పరారీలో ఉన్న నిందితుడు షేక్ షమ్మాను రాజోలులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బి.సావరం సిద్ధార్థ నగర్‌లోని ఒక అద్దె ఇంట్లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా (22) సహజీవనం చేస్తున్నారు. పుష్ప తన భర్తతో గొడవల కారణంగా విడిపోయి కొడుకు, అమ్మతో కలిసి నివాసం ఉంటుంది. సుమారు సంవత్సరం క్రితం నుంచి రాజోలు కోళ్లవారి గ్రూపునకు చెందిన షేక్ షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడింది. షమ్మా చెడు అలవాట్లకు బానిసై పుష్పను డబ్బుల కోసం కొట్టేవాడని, గత కొద్ది రోజులుగా కంప్యూటర్ కోర్సు అని చెప్పి అమలాపురం తీసుకువెళుతుండేవాడని సీఐ తెలిపారు. ఈనెల 16న అమలాపురం కంప్యూటర్ కోర్సుకు వెళ్లి వస్తుండగా బోడసకుర్రు బిడ్జిపై షేక్ షమ్మా డబ్బుల గురించి పుష్పతో గొడవపడి కొట్టాడు. ఇంటికి వచ్చిన తరువాత రాత్రి 10.30 గంటల సమయంలో తల్లి గంగమ్మ, తమ్ముడు పుష్పను ఎందుకు కొట్టావని షమ్మాను అడగ్గా మీరెవరు నన్ను అడగడానికి అని షేక్ షమ్మా కబోర్డులో ఉన్న చాకు తీసుకుని పుష్ప తల్లి గంగమ్మ, తమ్ముడిపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వెళ్లిన ఓలేటి పుష్ప ఎడుమవైపు గుండెపై చాకుతో పొడవగా విపరీతంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందిందని సీఐ తెలిపారు. పుష్ప తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.



రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

పరారీలో ఉన్న షేక్ షమ్మా కోసం గాలింపు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణ చేస్తూ రెండు టీమ్‌లు ఏర్పాటు చేశారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్, సిబ్బంది కలిసి శుక్రవారం సాయంత్రం షేక్ షమ్మాను రాజోలులో అతడి ఇంటి వద్ద అరెస్టు చేశారు. నిందితుడిని ఒక్కరోజులోనే పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. షమ్మాను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ నరేష్‌కుమార్ చెప్పారు.

ఆహా.. ఆషాఢం సారె

తలుపులమ్మకు అన్నవరం దేవస్థానం నుంచి సమర్పణ


కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో తలుపులమ్మకు సారె తీసుకొచ్చి సమర్పిస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో, అధికారులు

తునిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో గల తలుపులమ్మ అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి ఈవో సుబ్బారావు చీర, సారె సమర్పించారు. వారికి ఆలయ అధికారులు మంగళవాయిద్యాలుతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈనెల 24న అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో విశేష హోమ అభిషేకం జరుగుతుందని అధికారులు తెలిపారు.


శంఖవరం: కత్తిపూడిలో కనక దుర్గమ్మకు శుక్రవారం ఘనంగా ఆషాఢం సారె, బోనాలు సమర్పించారు.


ప్రత్తిపాడు: ధర్మవరం సూర్యారావుపేటలో దుర్గతల్లి గుడి వద్ద మహిళలు భారీ సారె సమర్పించారు.

నెయ్యి డబ్బాలు దొంగిలిస్తుంటే పట్టివేత...

అన్నవరంలో ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెండ్


నెయ్యి డబ్బాలతో పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్

ఈవో సుబ్బారావు ఉత్తర్వులు

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెయ్యి డబ్బాలను దొంగిలిస్తూ పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. సత్యదేవుడి తొలిపావంచా వద్ద కనకదుర్గ ఆలయంలో ఉప ప్రధాన అర్చక హోదా కలిగిన చిట్టెం హరిగోపాల్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హోమాలు, దీపారధన తదితర వాటికి వినియోగించాల్సిన 3 డబ్బాల నెయ్యిని శుక్రవారం ఎటువంటి అనుమతి లేకుండా కారులో తరలించే ప్రయత్నం చేయడంతో ఈవోకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాలతో ఏఈవో భాస్కర్ హుటాహుటిన వెళ్లి నిర్ధారించి ఈవోకు నివేదించారు. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పట్టుబడిన నెయ్యి డబ్బాల విలువ రూ.27వేలుగా అధికారులు తెలిపారు. 3 డబ్బాలను విచారణాధికారులు స్వాధీనం చేసుకుని దేవస్థానం సెంట్రల్‌స్టోర్స్‌కి తరలించారు. గతేడాది పదవీ విరమణ చేయాల్సిన సమయంలో ప్రభుత్వ జీవో కారణంగా ఆయన విధుల్లో కొనసాగుతున్నారు. ఆది నుంచి అర్చకుడు వివాదాస్పదంగానే విధులు నిర్వహిస్తుండడం విశేషం. గతంలో ఒకసారి అతడు పనిచేసే వన దుర్గ ఆలయ తాళాలు ఇంటికి పట్టుకెళ్లిన సంఘటనను సహచర అర్చకులు గుర్తుచేస్తున్నారు. అలాగే ఇదే సంఘటనలో అదే ఆలయంలో పరిచారకుడిగా పనిచేస్తున్న ఎన్ఎస్.సుబ్రహ్మణ్య కృష్ణకుమార్‌ను కూడా సస్పెండ్ చేశారు.

'అన్నవరం' సూపరింటెండెంట్‌కు ఏఈవోగా పదోన్నతి

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అనకాపల్లి ప్రసాద్‌కు ఏఈవోగా పదోన్నతి కల్పిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం నాయకుడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రసాద్‌కు దేవస్థానం ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

బైక్‌లు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్టు


అన్నవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ముగ్గురు జువైనల్స్ అన్నవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడడంతో వారిని శుక్రవారం అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. నిందితుల నుంచి 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిని రాజమండ్రి ప్రొబిషనరీ అధికారి ముందు హాజరుపరిచామని, స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఎస్ఐ హరిబాబు చెప్పారు.

ఒకే కుటుంబంలో నలుగురు అదృశ్యం

పట్టుకున్న కిర్లంపూడి పోలీసులు


అదృశ్యమైన వారిని పట్టుకున్న పోలీసులు

కిర్లంపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, బాలుడు, బాలిక ఆత్మహత్య చేసుకుంటామని చెప్పి 2024 నవంబరు 9న అర్ధరాత్రి అదృశ్యమయారు. దీనిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది గురు శ్రీ, శివప్రసాద్ మహారాష్ట్రలోని సోలాపూర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించి ఆ నలుగురిని పట్టుకున్నారు. వారిని వెతికి పట్టుకోవడంలో విశేష కృషి చేసిన ఎస్ఐ సతీష్ బృందాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వ్యక్తికి తీవ్రగాయాలు

అంబాజీపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మలుపు వద్ద మారుతికారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పుల్లేటికుర్రు ఆంధ్రబ్యాంకు దాటిన తరువాత ఉన్న మలుపు వద్ద ముక్కామల నుంచి కె.పెదపూడి వైపు వెళ్తున్న కారును అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో పాటు కారులో ఉన్న కె.పెదపూడి గ్రామానికి చెందిన సత్తిరాజుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి గురైన కారు

సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ధర్నా


కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన వారిని సీపీఎస్ పరిధిలోకి తీసు కోవాలని ప్రభుత్వ ఉద్యోగులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. డీఎస్సీ- 2003 ఉపాధ్యాయుల ఫోరం ఉమ్మడి తూర్పు గో దావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ జయరామ్ మాట్లాడుతూ సీపీఎస్‌కు ముందే నోటిఫికేష న్ విడుదల అయినప్పటికీ వివిధ కారణాల వల్ల ఉద్యోగంలోకి ఆలస్యంగా చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ సమస్యలను గత ప్రభుత్వంలో ప్రస్తావించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉద్యోగులు విభాగాల వారీగా పరిశీలిస్తే విద్యాశాఖలో 7361 మంది, హోంశాఖలో 1821 మంది, గ్రూప్-1, గ్రూప్-2లో 1800 మంది ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తమను సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యాయులు ఫోరమ్ ప్రతినిధులు జయ కృ ష్ణారెడ్డి, శ్రీలక్ష్మీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల కోసం కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం అంద జేశారు. హెల్త్‌కార్డుల కోసం కార్పొరేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు ఉద్యోగుల బదిలీల్లో ఏర్పడిన ఇబ్బందులను తొలగించాలన్నారు. అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి యెరుబండి రామ కృష్ణ, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు, కార్యదర్శి డి.రామ్మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికు మార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి


మరణించిన మరియమ్మ

తాళ్లరేవు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా చొల్లంగి జాతీయ రహదారి గురజనాపల్లి సెంటరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పులపకూర మరియమ్మ (49) మృతిచెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. చొల్లంగి గ్రామానికి చెందిన మరియమ్మ తన మనవరాలుని 6వ తరగతిలో చేర్పించేందుకు సీటు కోసం చొల్లంగిపేట గురుకుల పాఠశాలకు వెళ్లేందుకు గురజనాపల్లి సెంటరులో 216 రహదారిని దాటుతుండగా యానాం నుంచి వచ్చే ద్విచక్రవాహనం ఆటోను తప్పించబోయి మరియమ్మను ఢీకొంది. ఆమెను తీవ్రగాయలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందింది. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై సుత్తితో కొడుకు దాడి

కేసు నమోదు


గాయపడిన గంటా శ్రీను

రాయవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తనను మందలించాడని తండ్రి తలపై కొడుకు సుత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన గంట శ్రీను తన కుమారుడు గంటా పవన్ కల్యాణ్‌ను ప్రతి రోజు తిడుతున్నాడు. ఈనెల 17న రాత్రి శ్రీను భోజనం చేస్తున్న సమయంలో తండ్రి కొడుకులు మరోసారి గొడవపడడంతో ఆగ్రహంతో పవన్‌కల్యాణ్ తన తండ్రి శ్రీనుపై సుత్తితో తలపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చిన్నాన్నే చిదిమేశాడు!

పదేళ్ల బాలికపై ఏడాదిగా అత్యాచారం

పోక్సో కేసు నమోదు

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి స్థానంలో ఉండాల్సిన చిన్నాన్న కామంతో కళ్లు మూసుకుపోయి వరసకు కూతురైన 10 ఏళ్ల బాలికపై ఏడాది కాలంగా అత్యాచారానికి పాల్పడుతున్న సంఘటన బయటపడింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ వెంకటనగర్‌కు చెందిన గాది వెంకన్న(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అతడి భార్యకు ఇద్దరు అక్కలున్నారు. పెద్దక్క భర్త తాగుడుకి బానిసై ఇంటిని పట్టించుకోకపోవడంతో 5వతరగతి చదువుతున్న తన పదేళ్ల కుమార్తెను చిన్న చెల్లికి అప్పగించి తాను ఇళ్ల పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో అవకాశంగా తీసుకున్న చిన్న చెల్లి భర్త వెంకన్న ఆ బాలికకు తినుబండారాలు, ఆట వస్తువులు కొనిపెడుతూ మచ్చిక చేసుకుని ఏడాది కాలంగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక వేళ ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని బెదిరించాడు. అయితే గురువారం వెంకన్న అత్యాచారానికి పాల్పడుతుండగా బాధితురాలి చెల్లి ఎనిమిదేళ్ల బాలిక ఆ సంఘటనను చూసి విషయాన్ని తన తల్లికి చెప్పింది. వెంటనే ఆమె గురువారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మజ్జి అప్పలనాయుడు పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ వ్యవహరిస్తున్నారు.

విద్యుదాఘాతానికి కార్మికుడు దుర్మరణం

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-పిఠాపురం రోడ్డులో విద్యుత్ లైన్లు మార్చేందుకు ప్రైవేట్ కాంట్రాక్ట్ సిబ్బంది పనులు చేస్తుండగా డబుల్ ఫీడర్ అయిన 11 కెవీఏ విద్యుత్ లైన్‌ను తాకడంతో సామర్లకోట గణేష్‌కాలనీకి చెందిన నులకా భేతాళ్ళ(32) అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ముందుగా అందించిన సమాచారం మేరకు విద్యుత్ లైన్లు మార్చే ఫీడర్‌కు చెంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ రెండో వైపు నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని భావించకుండా నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వ్యవ హరించడంతో విద్యుత్ ఘాతానికి కార్మికుడు భేతాళ్ళ మృతిచెందినట్టు పలువురు భావించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా శుక్రవారం జరిగిన సంఘటనలో ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్ ఘాతానికి మృతి చెందడం తమ శాఖకు ఎంత మాత్రం సంబంధం లేదని కాంట్రాక్టర్ ముందుగా లైన్లలో పనులు చేస్తున్నపుడు పరిశీలన చేసు కోవాల్సిఉందని విద్యుత్ ఏడీఈ కిరణ్ పేర్కొన్నారు.


విద్యుత్ స్తంభంపై మృతిచెందిన కార్మికుడు

మత్తులో వ్యక్తి దాడి : మహిళ మృతి


గంగమ్మ (ఫైల్)

కూనవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి మహిళపై దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన అల్లూరి కూనవరం మండలం చింతగండిలో జరిగింది. గ్రామానికి చెందిన చదల కన్నపురెడ్డి కల్లు కోసం ఆ గ్రామంలో గురువారం రాత్రి సమయంలో గొడవ చేశాడు. ఎవరు మందలించినా వాగ్వాదానికి దిగాడు. అదే గ్రామానికి చెందిన వాళ్ల గంగమ్మ (45)తో గొడవ పెట్టుకున్నాడు. ఆమెపై కర్రతో బలంగా కొట్టడంతో అక్కడే మృతిచెందింది. అడ్డు వచ్చిన గంగమ్మ భర్త చిన్న భీమ్ రెడ్డిపై దాడి చేయడంతో చేతికి గాయమైంది. ఈ సంఘటనపై మృతురాలి కుమారుడు మాధవ రెడ్డి కూనవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ లతాశ్రీ కేసు నమోదు చేశారు. చింతూరు సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులా పాఠశాల... మరి చదువెలా!

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోను చూశారా.. చెరువు కాదండోయ్.. పాఠశాల ఆవరణే.. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఏలేశ్వరం బాలికోన్నత పాఠశాల ఆవరణలోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఆ నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకులు పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు డ్రైనేజీ ద్వారా బయటకు వెళ్లే ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చూపారు. దీంతో ఈ పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటం పరిపాటిగా మారింది. పర్యావరణం, పరిశుభ్రత అంటూ చూచనలు ఇచ్చే ఉపాధ్యాయులే విద్యార్థులను ఈ మురుగు నీటిలో పాఠశాలకు ఎలా రమ్మనాలో అయోమయంలో ఉన్నారు.



సామర్లకోట విద్యుత్ సిబ్బందిపై చర్యలు!

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సిబ్బంది ఇద్దరిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ నుంచి కాకినాడ జిల్లా విద్యుత్ ఉన్నతాధికారికి శుక్ర వారం సాయంత్రం ఆదేశాలు అందినట్టు విశ్వసనీయ సమాచారం. ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో తల్లికి ఆనందమేది పేరిట కథనం ప్రచురితమైన విషయం విధితమే. సొంతిల్లు అయినా లేని తన పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నమోదులు కావడం వల్లే తన ఇద్దరు చిన్నారులకు తల్లికి వందనం పథకం రాలేదని మహిళ కటకం నాగ సత్య గంగాభవాని ఆవేదనపై ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. ఇప్పటికే ఈ వివాదానికి చెంది విద్యుత్ ఏఈ అమలాపురం కన్‌స్ట్రక్షన్ సెక్ష న్‌కు బదిలీ అయిన విషయం విధితమే. కింది స్థాయి సిబ్బంది తప్పిదం కూడా ఉండడం వల్ల మహిళకు అన్యాయం జరిగినట్లు సీఎండీ కార్యాలయం అధికారులు భావించారు. దీంతో సామర్లకోట పట్టణ లైన్ ఇన్ స్పెక్టర్, లైన్‌మెన్‌పై సస్పెన్షన్ విధించాలని ఆదేశాలు కాకినాడ జిల్లా ఉన్నతాధికారికి అందినట్టు తెలిసింది.

బీచ్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ మృతదేహం


కల్యాణి (ఫైల్)

సర్పవరం జంక్షన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యా రావు పేట ఎన్టీఆర్ బీచ్‌లో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. కాకినాడ రా మా రావు పేట చర్చి స్ట్రీట్ సుబ్బయ్య హోటల్ సమీపంలో నివసిస్తున్న కారం కల్యాణి (37)గా తిమ్మాపురం పోలీసులు గుర్తించారు. ఆమె కాకినాడ నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. భర్త పాము ఉదయ్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగి. భర్త మృతి చెందడంతో కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వం కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడిలంకలో గ్రామ సర్వేయర్‌గా ఉద్యోగం ఇచ్చారు. భర్త మృతి చెందినప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి మానసిక సమస్య ఒత్తిడి, అనారోగ్య సమస్యతో బాధపడటంతో బీచ్‌కెళ్లి సముద్రంలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సూర్యా రావుపేట వీఆర్వో సమాచారం మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిమ్మాపురం ఎస్ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అక్రమంగా ఆయిల్ దిగుమతి

నలుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లతో పోలీసులు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆయిల్ దిగుమతి చేస్తున్న నలుగురు వ్యక్తులను అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శివార్లలో దుర్గాడ సమీపంలో గురువారం ఆయిల్ దిగుమతి చేస్తుండగా లారీలపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న విషయం విధితమే. ఈ దాడుల్లో పట్టుకున్న ట్యాంకర్లలో 9800 లీటర్ల ఆయిల్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. 2 ట్యాంకర్లు, ఆయిల్ తోడే మిషనుతో స్వాధీనం చేసుకుని నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీస్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ జిల్లా తుని ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా మూతబడిన రైల్వే గేట్ వద్ద రైలు పట్టాలపై తుని వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు ఢీకొని 50 ఏళ్ల వ్యక్తి మరణించాడు. నలుపు తెలుపు నీలం అడ్డచారల్ ఆఫ్ చేతుల టీ షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని తుని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిస్తే 9490619020 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

21 వరకు పోస్టల్ లావాదేవీలు నిలుపుదల

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఐటీ 2.0 కొత్త సాఫ్ట్‌వేర్ అప్డేడ్ కోసం శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు పోస్టల్ లావాదేవీలు నిలిపివేశారు. రిజిస్టర్ పోస్టులు, సేవింగ్స్ ఖాతాల లావాదేవీలు, ఇతరత్రా పలు సేవలు నిలిచిపోనున్నాయి. ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కాకినాడ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కోరారు.

శాకంబరీ అలంకారంలో గౌరీదేవి

గొల్లప్రోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌరీ సమేత మార్కండేయస్వామి ఆలయంలో ఆషాఢ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గౌరీదేవిని 60కిలోల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఉద్యోగుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. 26 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి పరిష్క రించాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్ కూడా వినతిపత్రాలు స్వీకరించారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎన్‌హెచ్ అధికారులతో అమలాపురం ఎంపీ, ముమ్మిడివరం ఎమ్మెల్యే చర్చలు

తాళ్లరేవు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సుంకరపాలెం బైపాస్ సెంటర్లో దీర్ఘకాలికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కోరారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం వేగేశ్న భాస్కరరాజు నివాసంలో ఎన్‌హెచ్ అధికారులు, యానాం మున్సిపల్ కమిషనరు, ప్రజాప్రతినిదులు, వర్తక సంఘం నేతలతో డ్రైనేజీ సమస్యపై చర్చించారు. ఎన్‌హెచ్ అధికారులు డ్రైనేజీ నిర్మాణం చేసిన తర్వాత సెంటరింగ్ మెటీరియల్‌ను తొలగించకుండా డ్రైన్‌లోనే వదిలేశారని, దీంతో డ్రైనేజీలో చెత్త పెరిగిపోయి మురుగునీరు ఎదరకు వెళ్లకుండా రోడ్డుపైకి పొంగిపోతోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వెంకటేశ్వరరావు తెలిపారు. సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ యానాం ప్రాంతంలోని హోటళ్ల, బిర్యానీ, చికెన్ దుకాణదారులు వ్యర్థాలను డ్రైనేజీలోకి వదిలేస్తున్నారన్నారు. యానాం ప్రాంతం వారు డ్రైనేజీ నీరు గోదావరిలోకి వెళ్లకుండా అడ్డకట్టవేసి ఆ నీటిని ఆంధ్రా ప్రాంతం వైపు మళ్లిస్తున్నందున ఈ సమస్య ఎక్కువైందన్నారు. డ్రైనేజీ సమస్యను ఈ నెలాఖరులోగా పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టాలని ఎంపీ హరీష్ సూచించారు. త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఈ సమస్యను నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. చర్చల్లో నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, యానాం మున్సిపల్ కమిషనరు బుద్ద అఖిల్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, నేతలు మందాల గంగసూర్యానారాయణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, ధూళిపూడి వెంకటరమణ, చెల్లి అశోక్, స్థానికుడు మోపూరి రెడ్డినాయుడు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సుంకరపాలెం బైపాస్ వద్ద డ్రైన్ సమస్యపై నేషనల్ హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సుబ్బరాజు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు


ఐదుగురు సభ్యులతో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ స్టీరింగ్ కమిటీ

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాంబమూర్తినగర్‌లో గల పీఆర్ భవన్‌లో శుక్రవారం ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా అత్యవసర సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా సహ ఇన్‌చార్జి పసుపులేటి చిన్నిబాబు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలో పెండింగులో ఉన్న గ్రామ, మండల కమిటీలను నియమించి, ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలన్నారు. ఇందుకు స్టీరింగ్ కమిటీ సభ్యులుగా కాకాడ నూకరాజు, వల్లూరి సత్తిబాబు, అంతరపు రాజు, పలివెల నవీన్, దేవరపు సురేష్‌లను నియమించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ ముప్పిడి శ్యామ్‌కుమార్, డోకుబుర్ర భద్రం మాస్టారు, ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూళ్లపల్లి రమణ; ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు హరిబాబు, ఇందన చన్నారి, మోటుకూరి వరలక్ష్మి, ఎమ్మెస్పీ నాయకులు మిరియాల వీరబాబు, తుమ్మలపల్లి చిన్నబాబు, దూళ్లపల్లి కృష్ణ, నరుకుర్తి ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు

కాకినాడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెంగళూరులోని అథాటో ఫౌండేషన్ సమకూర్చిన కాసరబడ ఉపకార వేతనాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు శుక్రవారం అందజేశారు. అకడమిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.6,750 చొప్పున 11 మందికి, పీజీ భౌతికశాస్త్రంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.9,000 చొప్పున, రెండు ఉత్తమ ప్రాజెక్టులకు రూ.5,000 చొప్పున కలిపి మొత్తం రూ.93,250 చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు డాక్టర్ ఎం.సురేఖ, వి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.హరిరామ్ ప్రసాద్, అధ్యాపకులు జయదేవ్, శ్రీదేవి, పద్మావతి, ప్రసాద్, హిమకర్, దుర్గారావు, శ్రావణి, గీత తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంజనేయులుతో ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు



మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం మరిడమ్మ అమ్మవారికి వేదపండితుల పర్యవేక్షణలో శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో అర్చన జరిపారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు. మరిడమ్మ దేవస్థానంలో అన్నదాన పథకానికి ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు రూ.50వేలు విరాళం అందించినట్లు సహాయ కమిషనరు విజయలక్ష్మి తెలిపారు. ఆయనకు దేవదాయ శాఖ అధికారులు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

రూ.లక్ష విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగే హాకీ టోర్నమెంట్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కాకినాడ జిల్లా శాఖ రూ.1.05 లక్షల విరాళాన్ని డీఆర్వో వెంకట్రావుకు శుక్రవారం అందజేసింది. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, కార్యదర్శి రాంబాబు, ప్రతినిధులు రత్నరాజు, బానుప్రకాష్, స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపర్ణాదేవికి సారె సమర్పణ

గొల్లప్రోలు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవికి మహిళలు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. ఇంటి వద్ద వండిన పిండి వంటలు, స్వీట్లు తీసుకువచ్చారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు జరిపారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల సత్యనారాయణ, చెరుకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 12 మంది పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు. కంటే జగదీష్‌మోహన్ (బాబు), యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), బలుసు శ్రీనివాసు, బొందల రామలక్ష్మి, గుమ్మళ్ల రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, నిమ్మకాయల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తాండ్ర పాపారాయుడు వేషధారణలో చిన సత్యనారాయణ

అలరించిన తాండ్ర పాపారాయుడు ఏకపాత్రాభినయం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా సూర్యకళా మందిరంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికలు పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రం సౌజన్య కళాస్రవంతి విశాఖ వారిచే దేవరాగం నాటిక ప్రదర్శితమైంది. చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి క్రియేషన్స్ వారిచే మా ఇంట్లో మహాభారతం నాటిక ప్రదర్శించారు. అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటిక ప్రదర్శన జరిగింది. పేరూరు చినసత్యనారాయణ తాండ్ర పాపారాయుడు ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అచ్యుతరామారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యులు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.


హర్షమాధురి చదువు నిమిత్తం సతీష్‌బాబు ఫౌండేషన్ తరపున రూ.25వేలు అందజేస్తున్న దృశ్యం

స్నేహితుడి కుటుంబానికి ఎంపీ సతీష్‌బాబు ఆపన్న హస్తం

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు చిన్ననాటి స్నేహితుడు కేఎస్ కృష్ణారెడ్డి మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీ స్పందించారు. కృష్ణారెడ్డి కుమార్తె హర్షమాధురి ఇంజనీరింగ్ చదువు నిమిత్తం కళాశాల ఫీజు రూ.25వేలను సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్ ద్వారా శుక్రవారం అందజేశారు. మండలంలోని కొప్పవరంలో గల ఎంపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, చింతపల్లి అర్జున్, నెక్కంటి శ్రీనివాసు, జొన్నూరు బాబ్జీ, దుర్గాప్రసాద్, ముత్యాల అనిల్ పాల్గొన్నారు.

కాగా ప్రజా దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి 25 అర్జీలు వచ్చాయి. వాటిని సత్వర పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

ఎయిడ్స్ నియంత్రణపై సమీక్ష

జీజీహెచ్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి) ఎయిడ్స్ నియంత్రణపై శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లాకు రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. అదే విధంగా హెచ్‌ఎంఎస్ డేటా ఎంట్రీలో ఎటువంటి లోపం లేకుండా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షల వివరాలను అనుబంధ సమగ్ర కౌన్సిలింగ్, పరీక్షా కేంద్రాల కౌన్సిలర్స్ ప్రతి నెల సేకరించిన నాక్‌కి రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో హెచ్‌ఐవీ, సిఫిలిస్ పరీక్షల వివరాలు సక్రమంగా చేయాలని ఆదేశించారు. గర్భిణులకు హెచ్‌ఐవీ పాజిటివ్ ఉంటే డెలివరీ, డీబీఎస్ పరీక్షలు తగిన సమయంలో జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రస్థాయి ర్యాంకింగ్‌లో మెరుగుపడే విధంగా పని చేయాలని సూచించారు. ఏఆర్‌టీ, ఐసీటీసీ, డీఎస్ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ తీరుపై అసంతృప్తి

ఉపాధి పనులపై ప్రజావేదిక

కరప, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో ఎం.బుక్ సక్రమంగా నిర్వహించకపోవడం, సంతకాలు లేకుండా పేమెంట్లు చెయ్యడం, రికార్డుల నిర్వహణ తీరు సరిగ్గా లేకపోవడంపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం 18వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఎంపీపీ పెంకే లక్ష్మి అధ్యక్షతన గ్రామాలవారీగా నిర్వహించిన ఉపాధి పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ విచారణ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,222 పనులకు రూ.13.28 కోట్లు ఖర్చు చేశారు. ఎస్ఆర్‌పీ సీహెచ్ నాగసత్యనారాయణ పర్యవేక్షణలో డీఆర్పీలు గ్రామస్థాయిలో పనులను పరిశీలించి నివేదిక అందించారు. పనుల్లో అవకతవకలు గుర్తించి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.13,386 రికవరీ చేయాలని, ఫైన్ల రూపేణా మరో రూ.26వేలు వసూలు చెయ్యాలని ఆదేశించారు. ఏపీడీ వసంతమాధవి, విజయ్‌భాస్కర్, జీవీ రమణకుమార్, వై.హేమ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర: రత్నాకర్

పెద్దాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా కుట్ర జరుగుతోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌తో వంద మందిలో కేవలం నలుగురికి మాత్రమే లబ్ధి జరుగుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ముసుగు లో వాటాల కోసం దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1,108 కులాలు నిరంతరం పోరాటం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. తెలంగాణ, ఏపీల్లో అధికార పార్టీల నాయకులు ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించేందుకు వేరే ఏ సమస్యలూ లేనట్టు ఎస్సీ వర్గీకరణను తెరపైకి తెచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం జరుగుతుందన్నారు. కొప్పుల ప్రేమ్‌బాబు, దుర్గాప్రసాద్, కాకర రవితేజ, నెల్లి సూరిబాబు, బచ్చల చిన్నా, నడిపూడి రమణ, బెందకుర్తి పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మణికుమారి



సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అందుగుల మణికుమారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మరో రెండు రోజులలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.


ఎమ్మెల్యే చినరాజప్పను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

సామర్లకోట పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీనివాసరావు

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పీఏసీఎస్ చైర్మన్‌గా తెలుగు రైతు నాయకుడు పైణ్ణి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే చినరాజప్పకు శ్రీనివాసరావు శాలువా కప్పి సత్కరించారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, యార్లగడ్డ చిన్ని, బలుసు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ప్రైవేటు బస్సుల తనిఖీ

కాకినాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లే ప్రైవేటు బస్సులను శుక్రవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. బస్సుల రికార్డులు సక్రమంగా ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేశారు. లగేజీని కూడా పరిశీలించారు. నగరంలోని పీఆర్ కళాశాల రోడ్డు, ఆర్డీవో ఆఫీసు సమీపంలో ఈ తనిఖీలను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించారు. తనిఖీల్లో ఎంవీఐలు శ్రీకాంత్‌బాబు, సవిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

26న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 26న ప్రదర్శించనున్న 'బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేడ్కర్' నాటక ప్రదర్శన కరపత్రాన్ని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. న్యాయవాదులు పెందుర్తి ప్రసన్నకుమార్, టి.పృధ్వీరాజ్, పితాని శ్రీనివాస్, ఎస్‌కే ఇజాజుద్దీన్, జేవీ రమణ, వడ్డి శ్రీనివాస్, రోహిణి, కె.నాగజ్యోతి, నాగభూషణం, నాటక ఆహ్వాన కమిటీ కన్వీనర్ పి.రామారావు, సహ కన్వీనర్ పి. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో ముద్దాయిలకు వైద్య పరీక్షలు

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం కాకినాడ స్పెషల్ సబ్ జైల్లోని ముద్దాయిలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. 85 మందికి టీబీ స్క్రీనింగ్, ఏడుగురికి శాంపుల్స్ కలెక్షన్ చేశారు. 85 మందికి హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.వీరబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ జోసఫ్, వైద్య-ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీఆర్ వర్ధంతి

సర్పవరం జంక్షన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాపు సద్భావనా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎస్వీఆర్ చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో బసవా ప్రభాకరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అన్యాయం జరిగినపుడు చట్టాలను ఆశ్రయించాలి'

తాళ్లరేవు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అన్యాయం జరిగినపుడు ప్రజలు, మహిళలు చట్టాలను ఆశ్రయించాలని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కోరారు. శుక్రవారం తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా చట్టాలు, గృహహింస, లింగ వివక్షత చట్టాలు, గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై ఎస్ఐ అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలి'

కొత్తపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాకినాడ మాజీ ఎంపీ, వైసీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ కోరారు. కొత్తపల్లిలోని ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామస్థాయి నుంచీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తపల్లి జడ్పీటీసీ గుబ్బల తులసికుమార్, వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, మాజీ జడ్పీటీసీ వెంగళి సుబ్బారావు, కారే శ్రీనివాసరావు, గాది గంగబాబు పాల్గొన్నారు.

'తాగునీటిని కలుషితం చేస్తే చర్యలు'

పెద్దాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని కలుషితం చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిలో పైప్‌లైన్ లీకుల కారణంగా బయటకు వస్తున్న నీటిలో భారీ వాహనాలను క్లీన్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల యజమానులను హెచ్చరించారు. లీకులను అరికట్టేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

కరప, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రిపూడి గ్రామంలో శుక్రవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పర్యటించి నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కానూరి రమాదేవి శ్రీహరి, కూటమి నాయకులు బండారు మురళీ, బోగిరెడ్డి కొండబాబు, మామిడాల వెంకటేష్, ముద్రగడ రమేష్, గండి వెంకటేశ్వరరావు, అనుకూల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, సాగునీటి సంఘం అధ్య క్షుడు జోకా అప్పలరాజు, యనమదల దొరబాబు, కానూరి సురేష్, మెండు గోవింద తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కిర్లంపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కొల్లు, వేలంక గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం జిల్లా పంచాయితీ అధికారి వి.రవికుమార్ పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ పరిశీలించి తగు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సత్య ప్రసాద్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

‘సీలేరు’ చీఫ్ ఇంజనీర్‌ను కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు


రాజారావును మర్యాదపూర్వకంగా కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు

మోతుగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వి.రాజారావును సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలపై మర్యాదపూర్వకంగా కలిశారు. 2022లో జీవో ఇచ్చిన కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటి వరకు ఇళ్లలు ఇవ్వడం లేదు. దీనిపై సీఈ త్వరలోనే మీటింగ్ పెట్టి పరిక్షిస్తామన్నారు. అలాగే కొంతమంది కాంట్రాక్ట్ కార్మికులు 129 జీవో నుంచి 167 జీవోకి మారుస్తూ జనవరి 2025న జీవో ఇవ్వడం జరిగింది, కానీ ఆరు నెలలు అవుతున్నా పెంచిన జీతాలు ఇవ్వడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ సదుపాయం కల్పించాలన్నారు.దీనిపై సీఈ స్పందించి త్వరలో విద్యుత్ సౌధ అధికారులతో మాట్లాడి జీతాలు వేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కలిసిన సీఐటీయూ నాయకులు చింతల రాంబాబు, బీవీ రమణ, బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌సన్, బ్రాంచ్ సెక్రటరీ పేపకాయల శ్రీను, కాంట్రాక్ట్ కార్మికులు రాజేష్ పాల్గొన్నారు.

సిరిగిందలపాడు, నెల్లిపాకలో

‘సుపరిపాలనలో తొలిఅడుగు’


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రంపచోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిగిందలపాడులో శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై. నిరంజనీదేవి, గూడెం బుజ్జిబాబు, సముద్రాల రమణకుమార్, చవలం బాపన్నదొర, షేక్ మీరా, గూడెం శైలజ , తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి పథంలో నడుస్తోందని టీడీపీ తెలుగు యువత జిల్లా నేత నలజాల శ్రీకాంత్ చౌదరి, యూనిట్ ఇన్‌చార్జి ఏలూరి వెంకన్న అన్నారు. శుక్రవారం నెల్లిపాకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి రామకృష్ణ, నరేష్, జీ. శ్రీను, రాగూర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిపాకలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ


నెల్లిపాకలో సారె సమర్పిస్తున్న మహిళలు

ఎటపాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నెల్లిపాకలో ముత్యాలమ్మ తల్లికి శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వద్దకు సారెతో ఊరేగింపుగా వచ్చారు. అలాగే అమ్మవారు శాకంబరీ అవతారంలో దర్శనమిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కర్రి చిన్న శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు / శంఖవరం: ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం సూర్యారావుపేటలోని వరసిద్ధి వినాయకుని దుర్గమ్మవారి గుడి వద్ద శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. చీరలు, రవికలు, గాజులు, పసుపు, కుంకుమ, చలివిడి, పండ్లు, పండ్ల రసాలు, అరటిగెలలు, వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు సమర్పించారు. అమ్మవారిని గ్రామంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే శంఖవరం మండలం కత్తిపూడిలో కనకదుర్గమ్మకు లారీ యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు చేసి అభిషేకించారు. గ్రామంలో మహిళలు దుర్గమ్మకు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ అన్నసంతర్పణ చేశారు.


ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో కనకదుర్గను అలంకరించిన దృశ్యం

‘గిరి’ పాఠశాలలో అన్నీ సమస్యలే

● పట్టించుకోని అధికారులు... తప్పని ఇక్కట్లు


ఆరుబయట ఉన్న గొందిగూడెం పాఠశాల విద్యార్థులు

మోతుగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ గొందిగూడెం ప్రభుత్వ గిరిజన ప్రభుత్వ పాఠశాలను సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో విద్యార్థులను పాఠశాలకు పంపించాలంటే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రహరీ లేదు. అలాగే వర్షం వస్తే పాఠశాల ఆవరణమంతా నీటితో నిండిపోతుంది. తరగతి గది కారిపోతుండడంతో విద్యార్థులు తడిసిపోతున్నారు. తాగునీటి సౌకర్యం, కరెంటూ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి


కిర్లంపూడిలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే నెహ్రూ


పెదశంకర్లపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల

కిర్లంపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలం జగపతినగరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కిర్లంపూడిటౌన్ నాయకులు చదరం చంటిబాబు, గుడాల శ్రీలత రాంబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ళ వెంకటేష్, మద్దాల మణికంఠ స్వామి, ఆళ్ల శ్రీమన్నారాయణ తదితరుల ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి ఈఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేస్తూ ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, వీరంరెడ్డి కాశిబాబు, కంచుమర్తి రాఘవ, బొదిరెడ్ల సుబ్బారావు, బొడ్డేటి సుమన్, ఎడ్ల మురళీకృష్ణ, గండే రాయుడు, బేతాళ బాబ్జి పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం కూటమి శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం, ఫించన్ల పెంపుదల, గ్రామాల్లో రహదారులు, తాగునీటి వనరులు, ఇతర మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు వెన్నా శివ, బద్ది రామారావు, యాళ్ళ జగదీష్, గాబు కృష్ణమూర్తి, బద్ది రమణ, లక్ష్మీనారాయణ, బసవ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పరిసరాల పరిశీలన

కిర్లంపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం తామరాడలో హైస్కూల్, జూనియర్ కాలేజీ వద్ద శుక్రవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో పరిసరాలను పరిశీలించారు. పాఠశాల చుట్టుపక్కల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాతో ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పాఠశాలకు చుట్టుపక్కల 100 గజాల లోపు ఉన్న షాపుల్లో పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నారో లేదో పరిశీలన చేశారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు, సిబ్బంది ఉన్నారు.

కాత్రావులపల్లిలో కార్డన్ సెర్చ్

జగ్గంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాత్రావులపల్లిలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు, సిబ్బంది యూఆర్‌టీ టీమ్‌లతో సెర్చ్ నిర్వహించి ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలన సీజ్ చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.


బైక్‌లను సీజ్ చేసిన పోలీసులు

‘విద్యార్థులు లక్ష్యాలను గుర్తించుకోవాలి’


మాట్లాడుతున్న ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

గండేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల పాలిటెక్నిక్ కళాశాలల సీఎస్ఈ, ఈఈఈ బ్రాంచ్‌ల మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నుంచి తరగతులను ప్రారంభించారు. తల్లిదండ్రుల సమావేశంలో ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యం, లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాన్నారు. చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో

ఫ్యాన్లు, బల్బులు ధ్వంసం

ప్రత్తిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో విద్యుత్‌సరఫరాలో వ్యత్యాసాల కారణంగా నాలుగు ఫ్యాన్లు, బల్బులు ధ్వంసమయ్యాయి. శుక్రవారం ఆసుపత్రికి హెచ్చుతగ్గులతో కూడిన విద్యుత్ సరఫరా కావడంవల్ల వార్డుల్లోని ఫ్యాన్లు, బల్బులు ధ్వంసం అవ్వడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆసుపత్రికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంవల్ల జనరేటర్ సహాయంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య ఆపరేషన్లు నిర్వహించారు.

చంద్రబాబు సాగర్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలి

● కేంద్ర మాజీ మంత్రికి వినతి

ప్రత్తిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తమూరుపేట వద్దగల చంద్రబాబు సాగర్ ప్రాజెక్టును ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి చేయాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్ళంరాజుకు పీసీసీ సభ్యుడు ధర్నాల కోటశ్రీను వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కాకినాడకు విచ్చేసిన పళ్ళంరాజుకు ప్రత్తిపాడు నుంచి కార్యకర్తలతో ధర్నాల కోట తరలివెళ్లి పళ్ళంరాజుకు వినతిపత్రం అందజేశారు.

ప్రత్తిపాడులో వర్షం


ప్రత్తిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శుక్రవారం వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా వాతావరణం మారి కారు మబ్బులతో వర్షం పడింది. గంటసేపు విరామం లేకుండా వర్షం కురవడంతో గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతలకు అల్లాడుతున్న మండల ప్రజానీకానికి మారిన చల్లటి వాతావరణంతో సేదతీరినట్లు అయింది. మధ్యాహ్నం నుంచి మళ్ళీ ఎండ తీవ్రత కొనసాగింది.


ఎన్ఎన్ పట్నంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కూటమి ప్రభుత్వ పాలనలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే సత్యప్రభ


రౌతులపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం రాత్రి ఎన్ఎన్.పట్నం గ్రామంలో టీడీపీ నేత లాలం అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యప్రభ హాజరై ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. గ్రామస్తులు మంచినీటి కుళాయిలు కావాలని అడగ్గా అధికారులతో మాట్లాడి వేయిస్తానని తెలిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బద్ది మణిరామారావు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, రమణ, చినబాబు, వరహాలు పాల్గొన్నారు.


ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జ్వరాలతో జనం విలవిల

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జ్వరాలతో పల్లె ప్రాంతాల ప్రజలు విలవిల్లాడుతున్నారు. మండల గ్రామాల్లో అపరిశుభ్రత, కలుషిత తాగునీరు బారిన పడిన వారు ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చేరుతున్నారు. మర్రివీడు, జె.అన్నవరం, కిమ్మూరు, తూర్పులక్ష్మీపురం, యర్రవరం గ్రామాల నుంచి జ్వరాలు సోకిన వారు వెళుతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి జ్వరాలపై ప్రజలకు సూచనలు, సలహాలు అందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


శంఖవరం పంచాయతీ వద్ద సెంట్రల్ బృందం సభ్యులు

శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ సభ్యురాలు మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ పరిధిలో పర్యటించి ఇంటి మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి చెత్త సేకరణ ఎలా ఉందనే దానిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి, అప్పలరాజు, పంచాయితీ కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

టీడీపీలోకి భారీ చేరికలు

తునిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తొండంగి మండల ప్రధాన కార్యదర్శి నరసింహశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, ములికి రామకృష్ణ, శీకోలు చిన్ని, కామేశ్వరరావు, పీఈ చిన్నయ్యపాలెం దారా చిన అప్పారావు, తోట వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ ములికి రాంబాబు, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ ములికి శ్రీను, వార్డు మెంబర్ ములికి అప్పన్న, ఉప సర్పంచ్ గంపల కృష్ణుడు, శీకోలు గంగరాజు, తాటిపాక మేరి, పీత గంగ తదితరులు తేటగుంటలో పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. దాదాపు 100 కుటుంబాలు టీడీపీలోకి రాగా వారికి యనమల పార్టీ కండువాలు వేశారు. సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆర్యవైశ్యులకు అన్ని విధాల సహకారం

తునిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అన్ని విధాల సహకారం అందిస్తామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఏడాది పాటు నిర్వహించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తునిలో ప్రత్యేక కార్యకమాలు, వివిధ మండల సంఘాల ప్రమాణ స్వీకారోత్సవాలు నిర్వహించారు. వీటికి హాజరైన ఎమ్మెల్యే దివ్య పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించగా, ఎమ్మెల్యేను ఆర్యవైశ్యులు సత్కరించారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డుండి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ పై అవగాహన కలిగి ఉండాలి

తుని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తుని సీఐ గీతారామకృష్ణ తెలిపారు. తుని సీతారాంపురం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించగా, సీఐ విజయబాబు, సిబ్బంది ఉన్నారు.

పీఎం యోజన పథకంపై అవగాహన

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నగర పంచాయతీ కమీషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సోలార్ విద్యుత్‌పై లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలు, రాయితీపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.


రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

గ్రామీణ రహదారులను అనుసంధానిస్తాం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లను, ప్రధాన రహదారులతో అనుసంధానిస్తామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శుక్రవారం ఆమె కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో కలిసి నిర్మించనున్న కృష్ణాపురం - ఎల్లయ్యపేట రహదారికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రహదారులను అభివృద్ధి పరిచేందుకు బృహత్తర ప్రణాళికను అమలు చేయనున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రహదారుల అనుసంధాన ప్రక్రియ త్వరలో జరగనుందన్నారు. యల్లయ్యపేటలో నిర్మించనున్న ఫిషర్ మెన్ కమ్యూనిటీ భవనానికి భూమిపూజ నిర్వహించారు. అవసరమైతే మరో రూ.10 లక్షల నిధులు తాను మంజూరు చేయనున్నట్టు ఎంపీ తెలిపారు. అనంతరం పైడికొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు పాల్గొని ప్రభుత్వ విజయాలను కరపత్రాల ద్వారా ఇంటింటికి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు యనమల రాజేష్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటరమణ, జనసేన మండలాధ్యక్షులు బి.నాయుడు, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. లింగంపర్తి శ్రీ కనక మహాలక్ష్మి ఎరువుల దుకాణంలో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించి సరైన ఫాంలు లేవని నిర్ధారించి రూ.15,63,200 విలువ గల సరుకు విక్రయించరాదని కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నరసింహం తదితరులు ఉన్నారు.

కొనసాగిన కౌలు వేలం

తొండంగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ సంస్థాన సత్రం భూముల కౌలు వేలం శుక్రవారం కూడా కొనసాగింది. ఐదోరోజు 168.16 ఎకరాల భూములుకు వేలం పాట నిర్వహించగా రూ.13,56,998 ఆదాయం సమకూరింది. గత సంవత్సరం 12,73, 800 ఆదాయం సమకూరగా.. ఈఏడాది రూ.80, 198 ఆదాయం అధికంగా సమకూరింది. ఈవో శ్రీరాములు, పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, వడ్డి శ్రీనివాసరావు, ఫణికుమార్, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వాసవీమాత, మరిడమ్మ అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ


వాసవీ అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పిస్తున్న ఈవో దంపతులు

అన్నవరం, జూలై 18 (అన్నవరం): గ్రామంలో ఉన్న వాసవీమాత, గ్రామదేవత మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం అన్నవనం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు ఆషాఢం సారెను సమర్పించారు. చీర, పసుపు, కుంకుమ, తీపి పదార్థలను ఈవో దంపతులు సొంతఖర్చుతో అందజేశారు. ఇప్పటికే దేవస్థానం తరుపున విజయవాడ కనకదుర్గకు అందజేయగా శుక్రవారం తలుపులమ్మ అమ్మవారికి దేవస్థానం తరుపున అందజేశారు. వనదుర్గమ్మకు సారె సమర్పించాలనే అంశం వివాదాస్పదమవడంతో విరమించారు.

ఘనంగా చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు

జగ్గంపేట రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు, రాజపూడి, రామవరం గ్రామాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలను నిర్వహించినట్టు సీడీపీవో పూర్ణిమ తెలిపారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా, మహిళా పోలీసు కన్వీనర్‌గా 11 మంది సభ్యులతో కలిగిన వీసీపీసీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ జరగకుండా చూసేందుకు ఈ కమిటీలు కృషి చేస్తాయని వివరించారు. బాల్యవివాహాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమ్మాజీ, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీస్, హెల్త్ డిపార్మెంట్, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.